సాక్షి ప్రకాశం

శనివారం । 30 । నవంబర్ । 2024



అభ్యర్థుల ప్రిపరేషాన్!

జిల్లాలోని గ్రంథాలయాల్లో పుస్తకాల కొరత ఉంది. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరి యల్ లేదు. సిబ్బంది లేక గ్రంథాలయాలు తరచూ మూతపడుతున్నాయి.

- 8లో..

స్పా సెంటర్లో గంజాయి



ఒంగోలులోని ఓ స్పా సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడిచేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
29/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్ కేటాయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారిగా జె పార్థసారథిని నియమించగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) అడ్మినిస్ట్రేటర్‌గా కే అద్దెయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రకృతి పరిరక్షణ అభయాన్ విజయవంతం



మాట్లాడుతున్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజాతి

ఒంగోలు సిటీ: ఆయుర్వేద వైద్యాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో అనే అంశానికి సంబంధించి నిర్వహిస్తున్న ప్రకృతి పరిరక్షణ అభయాన్ కార్యక్రమాలు విజయవంతమైనట్లు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజాతి అన్నారు. ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం స్కూల్‌లో మెడికల్ క్యాంపు, డ్రామా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజాతి మాట్లాడుతూ ఆయుర్వేదం గొప్పతనాన్ని సెల్‌ఫోన్ ద్వారా వారి శరీర ప్రకృతిని ఎలా నమోదు చేసుకోవాలో ఆ వివరాలను సర్టిఫికెట్ ద్వారా ఎలా డౌన్లోడ్ చేయాలో తెలియజేశారు. ప్రజలు వారి స్మార్ట్ సెల్‌ఫోన్‌ను తీసుకొని దగ్గరలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలలకు వచ్చి వారి శరీర ప్రకృతిని తెలుసుకొని వారి సర్టిఫికెట్ పొందవలసిందిగా కోరారు. కార్యక్రమాన్ని డిసెంబరు 24వ తేదీ వరకు ప్రతి ఆయుర్వేద వైద్యశాలలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారిణి, జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు భ్రమరాంబ, డాక్టరు శకుంతల, ప్రధానోపాధ్యాయులు డాక్టరు వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టైగర్.. వద్దయ్యా!



అంతర్జాతీయంగా ఒకప్పుడు మీసం మెలేసిన టైగర్ రొయ్య తిరిగి వస్తోందంటే రైతులు ఆనందపడ్డారు.
సరికొత్త బ్రూడర్‌తో పునరాగమనంతో లాభాలకు ఢోకా ఉండదంటూ ఉత్సాహంగా సాగుకు సిద్ధపడ్డారు.
ఆ ఆనందం ఎంతోకాలం నిలువలేదు.
నకిలీ సీడ్‌తో ఆది నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి.
లాభాలు పక్కన పెడితే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించ లేదు. సంబంధిత శాఖ అధికారులు సైతం స్పందించడం లేదు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని, దీంతో సాగు భారంగా మారడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో విస్తీర్ణాన్ని సైతం తగ్గించుకుంటున్నారు.

- ఆశలు రేకెత్తించి.. మళ్లీ ముంచిన టైగర్ రొయ్యల సాగు
- కొత్తగా వచ్చినా.. వెంటాడుతున్న నకిలీలు
- పట్టించుకోని మత్స్యశాఖ, ఆక్వా అథారిటీ
- ఆదుకోని కూటమి ప్రభుత్వం
- నష్టపోతున్న ఆక్వా రైతులు

టంగుటూరు: టైగర్ అంటే ఆక్వా రంగంలో రారాజు. అంతర్జాతీయ మార్కెట్లో దీనికి మంచి గిరాకీ ఉంది. గతంలో వివిధ రకాల వైరస్‌లు చుట్టుముట్టడంతో ఆక్వా సాగులో అవి అంతర్ధానమయ్యాయి. ఎన్నో అధునాతన ప్రయోగాలు, పరిశోధనలతో వైరస్‌లకు ఎలాంటి తావులేకుండా ఉండే టైగర్ రొయ్య సరికొత్తగా వచ్చింది. వెనామీకి ప్రత్యామ్నాయంగా టైగర్ రొయ్య పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని అందరూ భావించారు. ఈ దఫా నకిలీ సీడ్ రైతుల పాలిట శాపంగా మారింది. ప్రారంభంలో రెండు హేచరీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. తమిళనాడు చెంగల్పట్టులోని హేచరీ, నెల్లూరు జిల్లాలోని వైష్ణవి హేచరీలకు మాత్రమే అనుమతులిచ్చాయి. ఈ రెండు హేచరీలు సరికొత్త బ్రూడర్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకొని సీడ్‌ను ఉత్పత్తి చేస్తూ వచ్చాయి. ఆ తర్వాత జిల్లాలో కొన్ని హేచరీలు సరఫరా చేసే సీడ్‌ను కొనుగోలు చేసి రైతులు సాగు చేస్తున్నారు. వాటిలో సరైన నాణ్యత లేకపోవడంతో సరైన ఉత్పత్తి రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. మోనోసీడ్ ద్వారా ఐదు నెలల్లో పంట చేతికి రావాలి. అయితే దాదాపు ఏడు నెలల సమయం పడుతోంది. అంతే కాకుండా దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ఎకరాకు సుమారు నాలుగు లక్షల మేర నష్టం వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 100 మంది



రొయ్యల చెరువు

తగ్గనున్న సాగు విస్తీర్ణం:

జిల్లాలో టంగుటూరు, సింగరాయకొండ, ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో సుమారు 7 వేల ఎకరాలకు పైగా రొయ్యల సాగు జరుగుతోంది. సముద్ర తీర ప్రాంతంలోని ఉప్పునీటి చెరువులతో పాటు, మంచి నీటి చెరువుల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు వెనామీ సాగు చేసే వారు. టైగర్ సీడ్ అందుబాటులోకి రావడంతో చాలా మంది వెనామీని తగ్గించి దీనికి ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 31 హేచరీలు ఉండగా అందులో కొన్ని మోనోడాన్ సీడ్ ను అందిస్తున్నాయి. వీటి నుంచి సరఫరా అయ్యే సీడు నాణ్యత సరిగా లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. దీనికి తోడు సాగు వ్యయం భారీగా పెరగడం, మార్కెట్లో సరైన ధరలు లభించకపోవడం, వాతావరణం సైతం అనుకూలించకపోవడంతో రైతు నష్టాల పాలవుతున్నాడు. గతంలో నకిలీ సీడ్‌పై కోస్టల్ అథారిటీ, మత్స్యశాఖ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకునే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి సైతం సహకారం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నారు. సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు తగ్గించినట్లు రైతులు చెబుతున్నారు.



వైరస్ సోకిన రొయ్యలు

రైతులు దాదాపు వెయ్యి ఎకరాల్లో దీనిని సాగు చేస్తుండగా ప్రస్తుతం కేవలం 40 మంది మాత్రమే సాగు చేస్తుండడం గమనార్హం.

అమలు కానీ హామీలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిన్న, సన్న కారు రైతులను ఆదుకునేందుకు 5 ఎకరాలు సాగు చేసే రైతులకు యూనిట్ విద్యుత్ ధర రూ.1.50 నిర్ణయించింది. కానీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిబంధనలతో పని లేకుండా ప్రతి ఆక్వా రైతుకు యూనిట్ ధర రూ.1.50కే ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఆక్వా రైతు ప్రస్తావనే లేదు. ఒక్క కేబినెట్ మీటింగ్ లో కూడా విద్యుత్ సబ్సిడీ పై చర్చించకపోవడం దారుణమని రైతులు విమర్శిస్తున్నారు. అలాగే ఫీడు ధరలకు కేంద్రం 8 శాతానికి తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి రాయితీలు ఇవ్వలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఆక్వా రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టి ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరుతున్నారు.

నకిలీ సీడ్‌తో నష్టాలు



స్థానిక హేచరీల్లో నకిలీ సీడ్ అంటగట్టడంతో 50 రోజులకే చేతికి రావాల్సిన పంట 70 రోజులకు రావడంతో పెట్టుబడి ఎక్కువై సాగు భారంగా మారింది. దీంతో ఖర్చులు ఎక్కువ కావడంతో నష్టాలు చవి చూస్తున్నాం. ప్రభుత్వం నకిలీ సీడ్‌ను అరికట్టాలి. ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి.

– వలివర్తి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు

విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి



రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలి. అసలే వైరస్ లు, నకిలీ సీడ్ తో ఇబ్బందులు పడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం ఫీడ్ ధరలు 8 శాతం తగ్గించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తగ్గించి ఆక్వా రైతులను ఆదుకోవాలి.

– ఉప్పలపాటి నాగరాజు, ఆక్వా రైతు

జీజీహెచ్‌లో రాత్రి వేళల్లో నిరాశ్రయులకు వసతి



జీజీహెచ్‌లో నిరాశ్రయులకు వసతి ఏర్పాటు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స కోసం జిల్లా నలుమూలల నుంచి రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. రోగులు వార్డులో చికిత్స పొందుతుంటే వారి సహాయకులు మాత్రం రాత్రి వేళల్లో నిద్ర పోయేందుకు సరైన వసతి సౌకర్యం లేక నానా అగచాట్లు పడుతున్నారు. దీన్ని గమనించిన జీజీహెచ్, నగర పాలక సంస్థ సహకారంతో ఆస్పత్రి ఆవరణలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని నిర్మించింది. ఇందులో వాష్ రూములు, టాయిలెట్లతో పాటుగా రాత్రి నిద్రించడానికి అనువుగా పడకలు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా మహిళలకు ప్రత్యేక వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ నిరాశ్రయులు గృహాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించనుంది. ఈ వసతి గృహంలో రోగుల సహాయకులు, బంధువులు, రోడ్డు పక్కన నివశించే యాచకులు, రైల్వే స్టేషన్, బస్టాండ్ ఫుట్‌పాత్‌ల మీద పడుకునే నిరాశ్రయులు రాత్రి వేళల్లో ఇక్కడ పడుకునే అవకాశం కల్పించినట్లు మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చలి, వర్షం వంటి ప్రకృతికి సంబంధించిన ఇబ్బందుల నుంచి రక్షించుకునేందుకు ఈ వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

3న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ఒంగోలు వన్‌టౌన్: ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని డిసెంబర్ 3వ తేదీ ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల ప్రకాశం, బాపట్ల జిల్లాల సహాయ సంచాలకులు జీ అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2వ తేదీ ప్రకాశం జిల్లా, బాపట్ల జిల్లాల్లోని దివ్యాంగులకు ఒంగోలు సంతపేటలోని డీఆర్‌ఆర్‌ఎం పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న దివ్యాంగులు 08592–281310 నంబరును సంప్రదించాలన్నారు.

ఉర్దూపై చిన్నచూపు

- ఉర్దూ మీడియం అభివృద్ధిపై దృష్టి సారించని విద్యాశాఖ
- జిల్లాలో ఖాళీగా ఉన్న 37 ఉర్దూ పోస్టులు
- డీఎస్సీలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్న తల్లిదండ్రులు
- జిల్లా మొత్తానికి కంభంలో మాత్రమే ఉన్న జూనియర్ కళాశాల, హైస్కూల్
- ఇంటర్ తర్వాత చదువుకోవాలంటే దూరప్రాంతాలే దిక్కు
- జిల్లాలో హైస్కూళ్ల సంఖ్య పెంచి, డీఎడ్, డిగ్రీ కోర్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్



కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల

జిల్లాలో ఉర్దూ మీడియం ఉన్న పాఠశాలలివీ..
ప్రైమరీ స్కూల్స్: 31
అప్పర్ ప్రైమరీ స్కూల్స్: 8
హైస్కూల్స్: 1 (కంభంలో)
జూనియర్ కళాశాలలు: 1 (కంభంలో)
ఉర్దూను ఒక భాషగా బోధించే పాఠశాలలు
ప్రైమరీ: 37
అప్పర్ ప్రైమరీ: 6
హైస్కూల్స్: 17
ఖాళీల వివరాలు:
మొత్తం పోస్టులు: 155
భర్తీ అయినవి: 118
ఖాళీలు: 37

కంభం: ఉర్దూ మీడియంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో జిల్లాలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉర్దూ మీడియంలో తమ పిల్లలను చదివిస్తే కచ్చితంగా ఉర్దూ టీచర్ ఉద్యోగం వస్తుందని మైనారిటీలు తమ పిల్లలను అధిక సంఖ్యలో ఉర్దూ మీడియంలో చేర్చేవారు. ఇటీవల కాలంలో ఉర్దూ మీడియాన్ని పట్టించుకోకపోవడం, జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతూ ఉర్దూ పాఠశాలలే కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయడంతో పాటు అవసరమైన చోట ఉర్దూ మీడియం పాఠశాలలు, కళాశాలల్లో ఉర్దూ మీడియంకు అవకాశం కల్పిస్తే మరింత మంది విద్యార్థులు ఉర్దూ మీడియంలో చదువుకునేందుకు అవకాశం కలుగుతుంది.

జిల్లాలో ఒక్కటే హైస్కూల్, జూనియర్ కళాశాల:

జిల్లాలో కంభంలో మాత్రమే ఉర్దూ మీడియంకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 60 ఏళ్లుగా ఉర్దూ మీడియం ఉండగా, గత 34 ఏళ్లుగా జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం కొనసాగుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియంలో ఖాళీగా ఉన్న లెక్కలు, ఉర్దూ, సోషల్ టీచర్ల పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో హైస్కూళ్లు, జూనియర్ కళాశాలలు లేకపోవడంతో తల్లిదండ్రులు ప్రాథమిక విద్య తర్వాత ఎక్కడికి పంపించాలో అర్థంకాక ఉర్దూ మీడియంలో చదివించేందుకు సంకోచిస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులు మొదట ఉర్దూ మీడియం చదివించినా 8వ తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియంలో వదిలేస్తున్నారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియంలో హెచ్‌సీఎంఎల్ గ్రూపు అందుబాటులో ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అక్కడ ఇంటర్ వరకు చదువుకుంటున్నారు. గతంలో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మంది వరకు ఉర్దూ మీడియం విద్యార్థులుండగా ప్రస్తుతం 60 కు చేరింది, హైస్కూల్‌లో పదో తరగతి చదివిన వారు ఇంటర్మీడియెట్ లో కొనసాగుతుంటారు.

ఇంటర్ తర్వాత ఇతర జిల్లాలే దిక్కు:

ఇంటర్మీడియెట్ వరకు కంభంలో చదువుకున్నా ఆ తర్వాత డిగ్రీ, డీఎడ్ చదువుకోవాలంటే మనజిల్లాలో ఎక్కడా అవకాశం లేదు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో గుంటూరు జిల్లా బోయపాలెం, పశ్చిమగోదావరి జిల్లా దూబచెర్ల లో మాత్రమే ఉర్దూ డీఎడ్ కళాశాలలున్నాయి. డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులు సైతం ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు:

జిల్లాలో ఉర్దూ మీడియంలో ప్రైమరీ పాఠశాలలు 31, అప్పర్ ప్రైమరీ 8, హైస్కూల్ 1 ఉన్నాయి. ఉర్దూను ఒక భాషగా బోధించే ఇంగ్లిషు మీడియం పాఠశాలల్లో ప్రైమరీ 37, అప్పర్ ప్రైమరీ 6, హైస్కూల్స్ 17 ఉన్నాయి. జిల్లాలో 155 ఉర్దూ పోస్టులు ఉండగా 118 మంది ఉన్నారు. 37 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని చోట్ల ఉర్దూ బోధించే ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడుతుండగా కొన్ని చోట్ల రేషనలైజేషన్ లో ఇంగ్లిషు ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. అలా చేయడం వలన ఇంగ్లిషు మీడియం ఉపాధ్యాయులు ఉర్దూ బోధించలేక అక్కడ విద్యార్థుల సంఖ్య తగ్గి అసలు ఉర్దూ పోస్టులే అవసరం లేదని జిల్లా యంత్రాంగం ఉన్నతాధికారులకు రిపోర్టులు పంపిస్తున్నారు. దీంతో వచ్చే డీఎస్సీలో సైతం ఉర్దూ పోస్టులకు లేకుండా పోయే అవకాశం ఉంది.

ఖాళీల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం

జిల్లాలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ల పోస్టులు కేటగిరీల వారీగా ఉన్నతాధికారులకు నివేదించాం. పలు పాఠశాలల్లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా ఉన్న చోట ఉపాధ్యాయులను నియమిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– షేక్ మోయినుద్దీన్, ఉర్దూ డీఐ, ప్రకాశం జిల్లా

15 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్నాను



మాది తురిమెళ్ల గ్రామం. నేను కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్నాను. ప్రతి రోజు బస్సులో వస్తాను. మా గ్రామంలో కొంత మంది పిల్లలు దూరం వెళ్లలేక ఉర్దూ మీడియం నుంచి ఇంగ్లిషు మీడియంలోకి మారుతున్నారు.

– షేక్ బిలాల్, పదో తరగతి విద్యార్థి

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



కంభంలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన తర్వాత పై చదువులకు వెళ్లాలంటే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియం విభాగం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– అఫ్రా నాజ్నీన్, ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఉర్దూ మీడియం

మైనంపాడు డైట్ కాలేజీలో ఉర్దూ మీడియం ఏర్పాటు చేయాలి



ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన తర్వాత డీఎడ్ చేయాలంటే గుంటూరు లేదా పశ్చిమ గోదావరి జిల్లాలకు వెళ్లాల్సి వస్తుంది. జిల్లాలో మైనంపాడులో ఉన్న ప్రభుత్వ డైట్ కాలేజీలో ఉర్దూ మీడియం ఏర్పాటు చేస్తే జిల్లాలోని విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉర్దూ మీడియం చదివే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– షేక్ ఫరీదా, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, ఉర్దూ మీడియం

ఫెంగల్..అప్రమత్తం

- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- మత్స్యకారుల ముందస్తు జాగ్రత్తలు
- వలలు, బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలింపు


కొత్తపట్నం: ఫెంగల్ తుఫాన్ కారణంగా జిల్లాలోని సముద్ర తీర ప్రాంత మండలాల్లో ఉన్న మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ ప్రభావంతో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో పాటు సముద్రం కొంత మేర ముందుకు రావడంతో కొత్తపట్నం తీరంలో ఉన్న బోట్లు, వలలు, ఇంజన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సముద్రంలో లంగర్లు వేసిన బోట్లను కూడా ఒడ్డుకు చేర్చుకున్నారు. రెవెన్యూ అధికారులు మత్స్యకార గ్రామాలను సందర్శించి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులను పునరావాస ప్రాంతానికి చేరాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వర్షం పడటం ప్రారంభమైంది. తీర ప్రాంతం అలల దెబ్బకు కోతకు గురైంది. నవంబర్ నెలంతా తుఫాన్‌లు, భారీ వర్షాలు పడటంతో వేటకు వెళ్లలేకపోయామని మత్స్యకారులు అంటున్నారు. సముద్రం ఎగిసిపడటంతో కార్తీకమాసంలో నిత్యం సముద్ర స్నానానికి వచ్చే యాత్రికులు సముద్ర స్నానం చేయకుండా వెళ్లిపోయారు.




పాకలలో తీరానికి దూరంగా ఉంచిన బోట్లు

పాకల తీరంలో అలల ఉధృతి:

సింగరాయకొండ: పాకల సముద్రతీరంలో శుక్రవారం ఫెంగల్ తుఫాన్ కారణంగా అలల ఉధృతి తీవ్రంగా ఉంది. సముద్రం అలజడిగా ఉండటంతో మత్స్యకారులు తమ బోట్లను తీరానికి దూరంగా ఉంచుకున్నారు. అలల ఉధృతి కారణంగా అధికారులు చేపల వేటకు వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశారన్నారు. బోట్లు వేటకు వెళ్లాలంటే అలల అలజడి బాగా ఉందని, ఈ సమయంలో వేటకు వెళితే బోటు తిరగబడే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. అలల ఉధృతికి వలలు కొట్టుకుపోకుండా బోట్లలోనే భద్రపరచుకున్నామన్నారు. పాకలలో సముద్రపు నీరు తీరానికి 10 మీటర్లు దూరంగా వెళ్లినట్లు మత్స్యకారులు తెలిపారు.



కొత్తపట్నం తీరంలో ఒడ్డుకు చేర్చిన బోట్లు, వలలు



సముద్రం తీరానికి 10 మీటర్లు వెనక్కి వెళ్లిన దృశ్యం

ఐదు మండలాల్లో కొద్దిపాటి వర్షపాతం నమోదు

ఒంగోలు అర్బన్: జిల్లాలోని ఐదు మండలాల్లో శుక్రవారం కొద్దిపాటి వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావానికి సంబంధించి జిల్లాకు ఎటువంటి ఇబ్బంది లేదని, పెద్దగా వర్షపాతం కూడా నమోదయ్యే పరిస్థితి లేదని ఆ దిశగా విపత్తుల శాఖ కూడా జిల్లాకు ఎటువంటి సూచనలు చేయలేదని అధికారులు తెలిపారు. శుక్రవారం మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు మండలాల్లో రెండు నుంచి నాలుగు మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.

ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి

నాగులుప్పలపాడు: రబీలో రైతులు సాగుచేసిన పంటలను వ్యవసాయ సిబ్బంది వేగవంతంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. రబీకి సంబంధించిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం మద్దిరాలపాడు గ్రామంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రతి రైతు వారు వేసిన పంటను తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. తద్వారా పంటల బీమా పథకంలో నమోదుకు, పంట నష్టం జరిగినప్పుడు పరిహారం నమోదుకు, రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునేందుకు వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి వెంకటరావు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

త్రిపురాంతకం: కార్తీక మాసం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద తూర్పు మెట్ల మార్గంలో శుక్రవారం దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయాల వద్ద కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



తూర్పు గోపురం మెట్ల మార్గంలో కార్తీక దీపోత్సవం

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

త్రిపురాంతకం: పొలం తగాదాలో దాడి చేసి ఒక వ్యక్తిని గొడ్డలితో చంపేందుకు ప్రయతి ్నంచిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు. త్రిపురాంతకం మండలం నడిపాలెం వద్ద వల్లెల ఈశ్వరరెడ్డిపై పొలం సమీపంలోని అన్నసముద్రం రోడ్డులో గొడ్డలితో దాడిచేసిన నడిపాలేనికి చెందిన గాజుల వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా వినుకొండ మండలం నీలగంగవరంకు చెందిన మర్రి పెద్ద అంజయ్యలను వెంగాయపాలెం గ్రామ జంక్షన్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మార్కాపురం కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్‌ఐ వివరించారు.

ఎరువుల దుకాణంపై 6ఏ కేసు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పామూరు: స్థానిక లక్ష్మీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్ దుకాణంపై 6ఏ కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కంచం రాధ తెలిపారు. శుక్రవారం పామూరులో జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు అధికారి జె.కులశేఖర్ ఆధ్వర్యంలో సీఐ సీహెచ్ రవిబాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ సీహెచ్ శివనాగప్రసాద్, స్థానిక ఏఓ కంచం రాధ, డీసీటీఓ బి.రామారావు, సిబ్బంది ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. లక్ష్మీశ్రీనివాస ఫెర్టిలైజర్స్ దుకాణంలో ఈపాస్ మిషన్‌లోని స్టాకుకంటే గోడౌన్‌లో రూ.2,51,520 విలువచేసే వివిధ రకాల ఎరువులు 203 బస్తాలు తక్కువగా ఉండటంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు ఏఓ వివరించారు. ఎవరైనా ఎరువుల విక్రయాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

13 గృహాల్లో చోరీ

యర్రగొండపాలెం: మండలంలోని గుర్రపుశాల ఎస్సీ పాలెంలో శుక్రవారం 13 గృహాల్లో చోరీ జరిగింది. వివిధ గృహాల్లో రూ.5 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.14 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. పనుల కోసం కొన్ని గృహాల వారు వలసలు వెళ్లగా మరికొన్ని గృహాల వారు రోజూ వారి కూలి పనులకు వెళ్లిన సమయంలో చోరీలు జరిగినట్లు తెలిసింది. విషయం తెలిసిన వెంటనే సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు, ఎస్సై చౌడయ్య హుటాహుటిన గ్రామాలకు వెళ్లి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణాన్ని మార్చండి



సీఐకి వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

గిద్దలూరు రూరల్: తమ ప్రాంతంలో మద్యం దుకాణం తొలగించాలని గిద్దలూరులోని సినిమా థియేటర్ సెంటర్‌కు చెందిన స్థానికులు శుక్రవారం ఎక్సైజ్ సీఐ జయరావును కలిసి వినతి పత్రం అందజేశారు. సినిమా థియేటర్ సెంటర్‌లో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, పిల్లలు తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని సీఐకి వివరించారు. మందుబాబులు, అల్లరిమూకల వల్ల తమ జీవనానికి ఆటంకం కలుగుతోందని వాపోయారు.

●కఠిన పరీక్ష..

అభ్యర్థుల ప్రిపరేషాన్!

- జిల్లాలోని గ్రంథాలయాల్లో పుస్తకాల కొరత
- పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ నిల్
- సిబ్బంది లేక తరచూ మూతపడుతున్న లైబ్రరీలు
- 104 మందికిగాను పనిచేస్తోంది 34 మందే..



మెటీరియల్ లేని పుల్లలచెరువు గ్రంథాలయం



కొనకనమిట్లలో పుస్తకాల దుస్థితి..

డీఎస్సీ సిలబస్ విడుదలైంది.. కానిస్టేబుల్ ఈవెంట్స్ ముగిశాక మెయిన్ పరీక్షకు యువత సిద్ధం కావాల్సి ఉంది. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్స్, ఇతర పరీక్షల కోసం ఎదురు చూస్తూ వేలాది మంది అభ్యర్థులు సాధన చేస్తున్నారు. గ్రంథాలయాలు వేదికగా మేదస్సుకు పదును పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న అభ్యర్థులను పుస్తకాల కొరత వేధిస్తోంది. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ గ్రంథాలయాల్లో పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో వేల రూపాయలు వెచ్చించి పుస్తకాలు కొనలేక పేద విద్యార్థులు సతమతమవుతున్నారు.

పుల్లలచెరువు/కొనకనమిట్ల:

డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు కొలువు సాధించడానికి కోటి ఆశలతో సిద్ధమవుతున్నారు. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని గ్రంథాలయాల్లో తాము కోరిన పుస్తకాలు అందుబాటులో ఉండటం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయాల్లో వర్తమాన వ్యవహారాలు, లోకజ్ఞానం, రీజనింగ్, అర్థమేటిక్, సోషల్ స్టడీస్, చరిత్ర, ఎకనామిక్స్, సైకాలజీ తదితర పుస్తకాలు అందుబాటులో ఉండాలి. కానీ పాలకులు పట్టించుకోకపోవడంతో పరీక్షలకు ఎలా సిద్ధం కావాలని నిరుద్యోగ యువతీ యువకులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలోని గ్రంథాలయాల్లో ఉద్యోగుల ఖాళీలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన సిబ్బంది	ప్రస్తుతం ఉన్నది	ఖాళీలు
గ్రేడ్-1 గ్రంథపాలకుడు	02	02	-
గ్రేడ్-2 గ్రంథపాలకుడు	04	-	04
గ్రేడ్-3 గ్రంథపాలకుడు	47	23	24
రికార్డ్ అసిస్టెంట్	26	06	20
అటెండర్లు	14	-	14
వాచ్‌మెన్లు	08	-	08
టైపిస్టు	01	01	-
జూనియర్ అసిస్టెంట్	02	02	-
మొత్తం	104	34	70

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో 66 గ్రంథాలయాలు ఉండగా 30 చోట్ల లైబ్రేరియన్ల కొరత వేధిస్తోంది. అన్ని లైబ్రరీల్లో కలిపి 104 మంది సిబ్బందికిగాను 34 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో గ్రంథపాలకుడు రెండు లేదా మూడు లైబ్రరీలను చూసుకోవాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల గ్రంథపాలకులు లేక జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, అటెండర్లతో నెట్టుకొస్తున్నారు. జిల్లాలో సుమారు 50 గ్రంథాలయాలు వారానికి 3 నుంచి 4 రోజులు మాత్రమే తెరుస్తున్నారు. లైబ్రేరియన్ ఒకచోట విధులు నిర్వర్తిస్తుంటే.. ఇన్‌చార్జిగా ఉన్న గ్రంథాలయాలకు తాళం పడుతోంది. దీంతో అక్కడి పాఠకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, నిరుద్యోగులకు, విద్యార్థులకు గ్రంథాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగిన పుస్తక పఠనం పాలకుల తీరు కఠినం

మండల కేంద్రమైన కొనకనమిట్లతో పాటు గొట్లగట్టు, పెదారికట్లలో గ్రామీణ గ్రంథాలయాలు మూతపడి ఏళ్లు గడుస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదు. గొట్లగట్టు వ్యాపార కూడలి ప్రాంతం కావటంతో నిత్యం 13 గ్రామాల ప్రజలు ఇక్కడి గ్రంథాలయానికి వస్తుంటారు. ఇక్కడ 42 ఏళ్ల క్రితం అద్దె గదిలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కొన్నేళ్ల క్రితం బస్టాండ్‌లోని పంప్ హౌస్‌లోకి మార్చారు. అదికూడా శిథిలావస్థకు చేరి లైబ్రేరియన్ మృతితో మూతపడింది. పెదారికట్లలోనూ గ్రంథపాలకుడు అచ్యుత్‌కుమార్ మరణించడంతో అప్పటి నుంచి గ్రంథాలయం తెరుచుకోలేదు. ఇక కొనకనమిట్లలో లైబ్రేరియన్ పదవీ విరమణ చేయడంతో గ్రంథాలయానికి తాళం పడింది. పుస్తకాలు చెదలు పట్టి పనికి రాకుండా పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి గ్రంథాలయాలు తెరిపిస్తే ఉపయోగకరంగా ఉంటుందని కొనకనమిట్ల మండల యువత, పాఠకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పెదారికట్లలో మూతపడిన గ్రంథాలయం

పుస్తకాలు అందుబాటులోకి తీసుకునిరావాలి



ప్రతి రోజు స్థానిక గ్రంథాలయానికి వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలతో డీఎస్సీకి సిద్ధమవుతున్నా. పుస్తకాల ధరలు పెరిగిపోవడంతో కొనలేకపోతున్నాం. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకునిరావాలి.

– వెంకటేశ్వర్లు, బీఎస్సీ బీఈడీ, డీఎస్సీ అభ్యర్థి, పుల్లలచెరువు

మళ్లీ పూర్వ వైభవం తేవాలి..



ఏళ్ల తరబడి మూతపడిన గ్రంథాలయాలను తెరిపించి మళ్లీ పూర్వ వైభవం తేవాలి. పాఠకులకు విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాలు మూతపడటంతో పుస్తకాలు పనికి రాకుండా పోతున్నాయి. గ్రంథాలయాలు ఉండి కూడా ఉపయోగం లేకుండా పోయింది. అధికారులు గ్రంథాలయాలను తెరిపించటంతో పాటు గ్రంథపాలకులను నియమించాలి.

-కె.బాలాంజనేయులు, గొట్లగట్టు

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయాలి

- ఏపీ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్



అమ్మనబ్రోలు పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

మద్దిపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏపీ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు అతి తక్కువగా జరగడాన్ని తాము గమనించామన్నారు. అన్ని వసతులూ ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు తక్కువగా జరుగుతున్నాయని, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో కాన్పుల్లో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై సమగ్రంగా సమాచారం సేకరించి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఇప్పటికే మూడు సెంటర్లను పరిశీలించామని, ఆయా సెంటర్లలో వైద్యశాఖ పోర్టల్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించామని చెప్పారు. ముందుగా ఆస్పత్రిలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసవాలపై ఒంగోలులో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్టేట్ ఐటీ కన్సల్టెంట్ వెంకటేష్, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఎల్.రాజు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.పద్మజ, డీపీహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ, డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ, డీపీఓ సుబ్బలక్ష్మి, ఆస్పత్రి డాక్టర్లు శ్రావణ్, ఆనందమోహన్, వినీలాచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మనబ్రోలు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ...

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏపీ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. వైద్యశాలలో వసతులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. వైద్యులు కళ్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 45 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదు అపహరణ



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై సుధాకర్

కంభం: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని సూరేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న గాలేటి వెంకట్రావు కుటుంబ సభ్యులు బంధువుల వద్దకు వెళ్లారు. ఆంజనేయస్వామి మాల ధరించిన వెంకట్రావు గురువారం రాత్రి మోహిద్దీన్‌పురం గ్రామంలో పడి పూజకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకుండా తాళం వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అదును చూసి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న రెండు బీరువాలు, ట్రంకు పెట్టెను పగలగొట్టి నాలుగున్నర తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు అపహరించుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని ఏఎస్సై సుధాకర్ పరిశీలించారు. మార్కాపురం నుంచి క్లూజ్ టీమ్‌ను ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన గిద్దలూరు వాసి



షేక్ ఖాజారెహమాన్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలోని 12వ వార్డుకు చెందిన షేక్ ఖాజారెహమాన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ ఏడాది జనవరిలో న్యాయమూర్తుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల కాగా ఏప్రిల్‌లో ప్రిలిమ్స్, జూలైలో మెయిన్స్, నవంబర్ 6న ఇంటర్వ్యూలో ఖాజారెహమాన్ ప్రతిభ చాటారు. ఆయన 5వ తరగతి చదువుతున్న సమయంలో తండ్రి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రహ్మతుల్లా మృతి చెందారు. అప్పటి నుంచి తల్లి ఖుర్షిద్, మేనమామ అల్తాఫ్ సంరక్షణలో విద్యాభ్యాసం కొనసాగించారు. విజయవాడలోని సెయింట్ జోసఫ్ స్కూల్లో 10 తరగతి, నంద్యాలలోని రావూస్ కళాశాలలో ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో 2020లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. విజయవాడ హైకోర్టులో జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఖాజారెహమాన్‌ను బంధుమిత్రులు అభినందించారు.

చోరీకి గురైన ల్యాప్‌టాప్‌ల అందజేత



బాధిత విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఒంగోలు టౌన్: అందరితో పాటు హాస్టల్లో ఉంటూ విద్యార్థులు కాలేజీకి వెళ్లిన వెంటనే ల్యాప్‌టాప్‌లను మాయం చేశాడో యువకుడు.లొంగోలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నంద్యాల జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ఒంగోలు నగరంలోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ చదువుతూ మంగమూరు రోడ్డులోని సుందర్‌నగర్‌లో గల బాయ్స్ హాస్టల్లో ఉంటున్నారు. గురువారం ఉదయం ఎప్పటిలాగే ల్యాప్‌టాప్‌లను రూంలో ఉంచి కాలేజీకి వెళ్లారు. సాయంత్రం కాలేజీ నుంచి తిరిగి వచ్చి చూడగా ల్యాప్‌టాప్‌లు కనిపించలేదు. దొంగతనం జరిగిందని భావించి ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన తాలుకా సీఐ అజయ్ కుమార్, ఎస్‌ఐ కృష్ణ పావని, శ్రీను, సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. హాస్టల్, పరిసరాలలోని సీసీ కెమేరాలను పరిశీలించారు. అదే హాస్టల్లో ఉంటున్న పొదిలికి చెందిన యువకుడు ల్యాప్‌టాప్‌లను దొంగిలించినట్లు గుర్తించారు. అతను నగరంలోని ఒక రియల్ ఎస్టేట్ కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్నట్లు సమాచారం. కేవలం గంటల వ్యవధిలోనే నిందితుడి వద్ద నుంచి ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

స్పా సెంటర్లో గంజాయి

- నిర్వాహకుడు, మరో కస్టమర్ అరెస్టు



స్పా సెంటర్లో తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ నాగరాజు

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున పవిత్రమైన దేవాలయానికి కూత వేటు దూరంలో పాడు పనులు చేస్తున్న వారిని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. స్పా ముసుగులో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న అసాంఘిక కార్యకలాపాలకు చెక్‌పెట్టారు. అక్కడ వ్యభిచారంతో పాటు గంజాయి విక్రయిస్తుండటం నగరంలో కలకలం సృష్టించింది. ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గంటాయపాలెం పార్వతమ్మ దేవాలయ సమీపంలో గల వీ2 స్పా సెంటర్‌పై శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. అక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా ఒక మహిళ పురుషుడికి మసాజ్ చేస్తుండటంతో పట్టుకున్నారు. స్పా సెంటర్ మొత్తాన్ని తనిఖీ చేసిన పోలీసులకు పెద్ద సంఖ్యలో కండోమ్‌లతో పాటు గంజాయి దొరకడంతో కంగుతిన్నారు. సుమారు 10 గంజాయి ప్యాకెట్లు, పెద్ద సంఖ్యలో కండోమ్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వచ్చిన విషయం పసిగట్టిన మసాజ్ చేస్తున్న మహిళ స్పా సెంటర్ నుంచి చాకచక్యంగా తప్పించుకుని పారిపోగా, నిర్వాహకుడు శ్రీనాథ్‌తో పాటు మరో కస్టమర్‌ను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పక్కా సమాచారం ప్రకారమే దాడులు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. ఎస్సై త్యాగరాజు, సిబ్బంది దాడిలో పాల్గొన్నారు. నివాస గృహాల మధ్య స్పా ముసుగులో వ్యభిచారాం నిర్వహించడంపై స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. ఇటీవల తరచూ నగరంలో స్పా సెంటర్ల మీద పోలీసులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టలేకపోతున్నారని మహిళలు విమర్శిస్తున్నారు.

మూడేళ్ల చిన్నారిపై వృద్ధుడు లైంగికదాడి యత్నం

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు



చినగంజాం: మూడేళ్ల చిన్నారిపై తాత వరుస అయ్యే వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శీలం రమేష్ అందించిన సమాచారం ప్రకారం.. బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని ఓ గ్రామానికి చెందిన భార్యాభర్తలు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు మంగళవారం తమ మూడేళ్ల చిన్నారిని తీసుకొచ్చారు. బాగా పొద్దు పోయేంత వరకు పెళ్లి హడావుడిలో ఉన్న వారు అలసిపోయి బుధవారం ఉదయం వరకు ఇంటిలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో వారి మూడేళ్ల కుమార్తె ఇంటి బయట ఆడుకుంటోంది. అదే కాలనీకి చెందిన చిన్నారికి తాత వరుస అయిన 60 ఏళ్ల చాట్ల అంజయ్య ఇంటి బయట తన ఈడు పిల్లలతో ఆడుకుంటున్న చిన్నారిని ఉద్దేశపూర్వకంగా ఇంటి సమీపంలో ఉన్న జొన్న చేనులోకి తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారికి ముద్దులు పెడుతూ లైంగికంగా వేధిస్తుండటంతో బాలిక పెద్దగా కేకలు వేసింది. ఆ సమయంలో ఉపాధి పనులకు వెళుతున్న స్థానిక యువకులు, మహిళా కూలీలు కేకలు విని అక్కడకు వచ్చి అంజయ్యను గట్టిగా మందలించడంతో అతడు తప్పు జరిగిపోయింది తనను క్షమించాలని కోరాడు. దాంతో వారు అతనిని మందలించి చిన్నారిని ఇంటి దగ్గర వదలిపెట్టి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఉపాధి కూలీల్లోని ఓ మహిళ 28వ తేదీ చిన్నారి తల్లితో పాటు మరికొందరు మహిళలతో పిచ్చాపాటి మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పింది. దాంతో ఆమె సమాచారం భర్తకు చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు చాట్ల అంజయ్యపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరస్వామి

ఒంగోలు మెట్రో: కార్తీకమాసం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శివాలయాల్లో శుక్రవారం వైభవంగా పూజలు చేశారు. శివయ్యకు అభిషేకాలు, బిల్వార్చనలు, నందీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ఒంగోలు నగరంలోని శివాలయాల్లో తెల్లవారుజామునే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకుని పూజలు చేశారు. మాలధారులు భజనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఒంగోలులోని దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో భజన చేస్తున్న భవానీ మాలధారులు